గౌడ కులస్థుల బోనాల జాతరలో జగ్గారెడ్డి, నిర్మల



సంగారెడ్డిలో గౌడ కులస్థుల బోనాల జాతరలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన గౌడ కులస్థుల బోనాల జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి పట్టణంలో మహిళలు బోనాలతో అస్తబల్ వరకు ఊరేగింపుగా వెళ్లి రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. జాతరలో పోతరాజులు, శివసత్తువుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు, భవిష్యవాణిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మ తల్లి వేషధారణతో కళాకారుల నృత్యాలు పలువురిని అలరించాయి. పలహారం బండి ఊరేగింపు కనువిందుగా సాగింది. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో గౌడ కులస్తులు పెద్దఎత్తున ఎల్లమ్మకు బోనాలు ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించడం వారి ఐక్యతను చాటిచెబుతుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఆషాఢ మాసం బోనాలతో సంగారెడ్డిలో సందడి నెలకొంది. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన సంతోష్ కుమార్, కిరణ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు నక్క నాగరాజు గౌడ్, ప్రభుగౌడ్, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టేఫలి

- ఆ దంపతులకు వయసు భారమైనా ఆగని జీవన పోరాటం!

ఒకప్పుడు నాగలి పట్టి, ఎడ్లబండితో వ్యవసాయ క్షేత్రాల్లో శ్రమించిన బుచ్చయ్య, నరసమ్మ దంపతులకు వయసు మీద పడడంతో పొలం పనులు కరువయ్యాయి. సిద్దిపేటఅర్బన్ మండలం తడ్కపల్లికి చెందిన ఈ వృద్ధ దంపతులు, బతుకు బండిని లాగడం కోసం ఇప్పుడు వైన్ షాపుల వద్ద ఖాళీసీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శారీరక శ్రమకు దూరం కావడంతో, మిగిలిన శక్తిని కూడదీసుకుని, గౌరవంగా బతకడానికి పడుతున్న వీరి ఆరాటం ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తుంది. వయసుతో సంబంధం లేకుండా, బతుకుదెరువు కోసం నిరంతరం శ్రమించే ఈ వృద్ధ దంపతుల కృషి 'కష్టేఫలి' అనే నానుడికి సజీవ సాక్ష్యం.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి)





గూడంటే గూడు కాదు..

"నన్ను చూడు.. నా గూడు చూడు" అన్నట్లుగా ఉంది.. ఈ పిచ్చుక సంబరం.. హుస్నాబాద్‌లోని సంఘమిత్ర బీఈడీ కాలేజీ ముందు వేప చెట్టుకు పిచ్చుకలు గూళ్లు ఏర్పాటు చేసుకున్నాయి.అప్పుడప్పుడు గూడుపై ఉంటూ కనువిందు చేస్తున్నాయి.

- హుస్నాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి)

మైక్రోఫైనాన్స్‌ల మాయాజాలం



ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని, అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, తీరా కట్టలేకపోతే వేధింపులకు పాల్పడుతున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు సిద్దిపేట జిల్లాలో అరాచకాలకు పాల్పడుతున్నాయి. పది సంవత్సరాల క్రితం కనుమరుగైన ఈ సంస్థలు, ఇప్పుడు వందలాది సంఖ్యలో విస్తరించి, పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. అధిక వడ్డీలతో అప్పుల ఊబిలోకి నెట్టి, అప్పులు తీర్చకపోతే బహిరంగంగా అవమానాలకు గురిచేస్తూ, ఆత్మహత్యాయత్నాలకు పురిగొల్పుతున్నాయి. అధికారులు మాత్రం ఈ అక్రమ వడ్డీ వ్యాపారాన్ని కట్టడి చేయలేకపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వేధింపులకు కేరాఫ్ అడ్రస్
- గ్రామీణ ప్రాంతాలే లక్ష్యంగా వందలాది సంస్థల విస్తరణ

- అధిక వడ్డీ వసూలు
- ఉచ్చులో చిక్కుకుంటున్న ప్రజలు
- ఇటీవల వేధింపులు తట్టుకోలేక యువకుడి ఆత్మహత్యాయత్నం
- పదేళ్లక్రితం కనుమరుగైన ఈ సంస్థలు మళ్లీ వెలుగులోకి..

సిద్దిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు కొన్ని నెలల క్రితం డబ్బు అవసరమై ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ నుంచి ఇంటి పత్రాలు తాకట్టు పెట్టి రూ. 3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. నాలుగైదు నెలలు సక్రమంగా వాయిదాలు చెల్లించినా, ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో రెండు వాయిదాలు చెల్లించలేకపోయాడు. దీంతో సదరు వడ్డీ వ్యాపారులు ఫోన్ చేసి వేధించడం మొదలుపెట్టారు. కొన్ని రోజులు ఫోన్ ఎత్తకపోవడంతో, ఇంటి వద్దకు వచ్చి గొడవకు దిగారు. త్వరలోనే చెల్లిస్తానని చెప్పినా వినకుండా డబ్బు ఇవ్వాలని లేదంటే ఇంటికి వేలం నోటీసు అంటిస్తామని బెదిరించారు. చెప్పినట్టుగానే నోటీసు అంటించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి రక్షించారు. మైక్రో ఫైనాన్స్ వేధింపు వల్లే తాను ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు చెప్పాడు. ఇది ఒక్క గ్రామంలోనో, మండలంలోనో కాదు, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

10 నుంచి 20 శాతం వడ్డీ వసూలు

రుణాలు ఇచ్చే సమయంలో ముందుగా ఐదు శాతం వడ్డీ అని చెప్పి, ఆ తరువాత లాగిన్ అయిన తర్వాత మరో వడ్డీ ధరను నిర్ణయిస్తున్నారు. ఒక్కో ఫైనాన్స్ సంస్థ 10 నుంచి 20 శాతం మేరకు వడ్డీ రేట్లను వసూలు చేస్తోంది. ఉదాహరణకు, రూ. 10 లక్షలు రుణం తీసుకుంటే, అసలుతో పాటు వడ్డీ కలిపి రూ.20 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కోట్ల రూపాయలతో జరుగుతున్న ఈ ఫైనాన్స్ మాయలో పడి చాలామంది బాధితులు అప్పులు చెల్లించలేక లోలోపలే మదనపడుతున్నారు. రుణాలు ఇచ్చేందుకు, వసూలు చేసేందుకు వేర్వేరుగా సిబ్బందిని నియమించుకున్న

మిగతా 8వ పేజీలో

వందలాదిగా విస్తరించిన సంస్థలు

పదేళ్ల క్రితం ఆదరణ కోల్పోయి కనుమరుగైన మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఇప్పుడు మళ్లీ పుంజుకున్నాయి. పదుల సంఖ్యలో కాకుండా, వందలాది సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా విస్తరించి, పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలనే లక్ష్యంగా చేసుకొని తమ కార్యకలాపాలను విస్తరించాయి. ఐదుగురు సభ్యులున్న మహిళా సంఘాలకు కూడా రుణాలిచ్చి, వారిని అప్పుల ఊబిలోకి లాగుతున్నాయి.

29న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిద్దిపేట కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29న సిద్దిపేట మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగే సెలక్షన్స్‌లో అండర్ 8, అండర్ 10, అండర్ 12, అండర్ 14, అండర్ 16, అండర్ 18, అండర్ 20 విభాగాల్లో బాల బాలికలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి పతకాలు, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 3, 4న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో, 7న జనగామలో జరిగే జావలిన్‌త్రో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 28 వరకు బర్త్ సర్టిఫికెట్ జీరాక్స్ జతచేసి జిల్లా అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 8501977079, 9704061543 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

సహకార సంఘాలతో రైతులు ఆర్థికాభివృద్ధి

- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల చేయూతతో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని డీసీసీబీ చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి అన్నారు. కొండపాక పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం నాబార్డు ఆధ్వర్యంలో రైతులకు మహిళలకు రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలువురికి రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులతోపాటు మహిళా సంఘ సభ్యులకు సహకార సంఘాల ద్వారా రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. డీసీసీబీ పదేళ్లలో టర్నోవర్ నాలు గింతలు అయినట్లు తెలిపారు. పదేళ్ల కాలంలో డీసీసీబీ బ్యాంకును రూ.450 కోట్ల నుంచి రూ.2,450 కోట్ల టర్నోవర్ చేసి రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తూ అండగా నిలిచామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన కుకునూర్‌పల్లి మండలంలో పీఏసీఎస్ త్వరలోనే ఏర్పాటవుతుందన్నారు.

కుటీర పరిశ్రమలకు డీసీసీబీ ప్రోత్సాహం

కొండపాక మండలం మర్పడగ, సిరిసినగండ్ల, దుద్దెడ, కొండపాక గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులు ముందుకు వస్తే కుటీర పరిశ్రమల కోసం రుణాలు అందజేస్తామన్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా ఉండడం కోసం దుద్దెడ, మర్పడగ, కొండపాక గ్రామాల్లో ఎరువుల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు అధికారులు, లిడ్ క్యాప్ జిల్లా అధికారి హరిబాబు, ఫిషరీస్ జీఎం ఈశ్వర్, సొసైటీ జిల్లా డీజీఎం విఘ్నేశ్వర్, వెంకటేశ్వర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, డైరెక్టర్లు సురేందర్ రావు, నరసింహచారి, సెల్ బాలనర్సయ్య మాజీ ఎంపీపీ మంచాల కనకరాములు రైతులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లను కేజ్ వీల్స్‌తో రోడ్లపై నడపకూడదు

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లను కేజ్ వీల్స్‌తో బీటీ రోడ్లు, సీసీ రోడ్లపై నడిపితే చర్యలు తీసుకుంటామని సీపీ అనురాధ మంగళవారం ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రజలకు మెరుగైన ప్రయాణం కోసం రోడ్లను ఏర్పాటు చేసిందన్నారు. కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిద్దిపేటలో ప్రొటోకాల్ రగడ

- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఫొటో లేదంటూ బాహాబాహీ
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ నినాదాలు
- రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీలో గందరగోళం



బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట జూలై 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో లేదంటూ కలెక్టరేట్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. దీంతో తమ నాయకులు, పార్టీలకు అనుకూలంగా చేసిన నినాదాలు కలెక్టరేట్‌లో హోరెత్తించాయి. మంగళవారం సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నూతన రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఫొటో లేదని బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. దీంతో "మీ గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ సమీక్షా సమావేశానికి రాకుండా ఎక్కడున్నారంటూ" కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి వివేక్, మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరుల ముందే దాదాపు 20 నిమిషాల పాటు పోటాపోటీగా నినాదాలు చేయడంతో కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలను సముదాయించారు.

ఇందిరమ్మ ఇళ్లపై దృష్టిసారించాలి : వివేక్

జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లపై అధికారులు దృష్టి సారించాలని, లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి ఆదేశించారు. అలాగే జిల్లా అభివృద్ధిపై ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ సమీక్ష నిర్వహించారు.

20 నెలల్లో రెండు సార్లు సమీక్ష : హరీశ్‌రావు

ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రేషన్‌కార్డు నూతనంగా తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులను ఉదయం 10 గంటలకు రమ్మని చెప్పి, మధ్యాహ్నం 1.45 గంటలు దాటినా కనీసం మంచినీళ్లు, స్నాక్స్ అందించకపోవడం పట్ల అధికారులపై మండిపడ్డారు. సమావేశానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఆహ్వానించి, సమావేశంలో నేమ్ బోర్డు, కుర్చీ వేయకపోవడం పట్ల అధికారులపై వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 నెలల్లో 2 సార్లు మాత్రమే జిల్లా అభివృద్ధిపై సమీక్షా జరగడం వల్ల ఎన్నో సమస్యలు పెరిగిపోయాయని, ఇక నుంచి మూడు నెలలకొకసారి సమీక్ష జరిగేలా చూడాలని చెప్పారు. స్పందించిన మంత్రి వివేక్

మిగతా 8వ పేజీలో

'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ

జిల్లాలో నెలకొన్న పెండింగ్ పనులు 18 నెలలుగా ఆగిపోయాయని సమీక్షలో మాజీమంత్రి హరీశ్‌రావు పలు శాఖలపై సుదీర్ఘ వివరణ అందించారు. ఈ క్రమంలోనే ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "ఆదిలోనే అవాంతరాలు - ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్ కష్టాలు" కథనంపై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చేదే రూ.5లక్షలని, కానీ విద్యుత్ స్తంభం, బోరు కోసం రూ.2లక్షల మేర ఖర్చు చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారని, దానిపై కూడా ప్రభుత్వం ఒక స్పష్టతకు రావాలని కోరారు.



కలెక్టరేట్‌లో బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

యూరియా పరిమితం

- వినియోగం తగ్గించేందుకు చర్యలు
- నానో యూరియాపై అవగాహన
- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

7

స్నేహితుడి పుట్టిన రోజుకు వచ్చి.. మృత్యుఒడికి

- కొండపోచమ్మ రిజర్వాయర్‌లో పడి ఒకరి మృతి

6

మద్యం మత్తు.. అతి వేగం..

- ఇద్దరు మృతి
- తండ్రీకుమార్తెల మృతికి కారణమైన నిందితుడి అరెస్ట్

6

పోస్టాఫీసులో నవశకం

- ఐటీ 2.0 తో వేగవంతమైన సేవలు!
- డిజిటల్ చెల్లింపులు, మెరుగైన ట్రాకింగ్



సిద్దిపేట పోస్టాఫీస్‌లో ఐటీ 2.0 టెక్నాలజీ ప్రారంభిస్తున్న సిబ్బంది

సిద్దిపేట కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలు కూడా మారాలి. అప్పుడే ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తపాలాశాఖ కూడా సరికొత్త సాంకేతికతను వినియోగించుకొని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం పోస్టాఫీసుల్లో ఉన్న థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్ స్థానంలో, రాష్ట్ర తపాలాశాఖ ఆదేశాల మేరకు పోస్టాఫీసుల్లో ఐటీ 2.0 సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్, నల్గొండ డివిజన్లలో జూలై 8న దీనిని ప్రారంభించారు. మిగిలిన జిల్లాల్లో మంగళవారం నుంచి అన్ని తపాలా శాఖల్లోనూ ఈ సేవలను విస్తరించారు.

జిల్లాలో సేవలు ప్రారంభం

ఐటీ 2.0 సాంకేతికతను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్‌తో పాటు, 21 సబ్ పోస్టాఫీసులు, 145 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో మంగళవారం నుంచి అమలు చేస్తున్నారు. ఈ నూతన సాంకేతికతతో పార్సిల్, సీవోడీ (క్యాష్ ఆన్ డెలివరీ), వీపీపీ (వాల్యూ పేయబుల్ పార్సిల్) వంటి సేవల బట్వాడా మరింత వేగవంతం అవుతుంది. దీంతో పాటు, డిజిటల్ సిగ్నేచర్, ఆధునిక డిజిటల్ సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి తపాలాశాఖ ఐటీ 2.0 అనే అత్యాధునిక సాంకేతికతను తీసుకువచ్చింది. ఈ సాంకేతికత వల్ల డిజిటల్ పేమెంట్స్, డిజిటల్ సిగ్నేచర్ వంటి సేవలతో పాటు, పార్సిల్ (ఆర్టికల్) డెలివరీలో కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఆర్టికల్ ఎక్కడ ఉందనేది కూడా పక్కాగా ట్రాకర్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు ఈ ఆధునిక పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

కె. కరుణాకర్‌రెడ్డి, పోస్ట్‌మాస్టర్, సిద్దిపేట హెడ్ పోస్టాఫీస్

'డబుల్' ఇళ్లకు రంగులు

● లబ్ధిదారులకు కేటాయించేనా?

● పదేళ్లుగా ఎదురుచూపులు

నర్సాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేదల డబుల్ ఇళ్ల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు రంగులు కూడా వేస్తుండటంతో ఇక లబ్ధిదారులను ఎంపిక చేసి, కేటాయించడమే తరువాయి అని ఆశపడుతున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇప్పటికైనా కేటాయించాలని వారంతా కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నర్సాపూర్-వెల్దుర్తి మార్గంలో 2016 ఐదు వందల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో సుమారు 250 ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో ఉండగా, 250 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. చివరి దశలో ఉన్న 250 ఇళ్లకు ప్రస్తుతం అధికారులు రంగులు కూడా వేస్తున్నారు.




నర్సాపూర్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్లకు రంగులు వేసిన దృశ్యం

ఇంటి స్థలం లేని వారికి..

గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని వారి కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించినా.. లబ్ధిదారులకు కేటాయించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్లులేని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భూమి ఉన్న వారి మొదటి విడతలో ఇళ్లను మంజూరు చేసింది. ఇక స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లలో అవకాశం కల్పిస్తామంటూ అధికార పార్టీ నాయకులు హామీలు ఇస్తుండటంతో ఇప్పుడు పూర్తి చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు పాత దరఖాస్తుల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? లేక ఇందిరమ్మ పథకం కింద స్థలాలు లేని వారికి కేటాయిస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

లబ్ధిదారుల ఎంపిక కత్తిమీద సామే..

పట్టణంలో డబుల్‌బెడ్ రూము ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక అధికారులకు కత్తిమీద సాములా మారనుంది. ఇక్కడ 500 ఇళ్లను నిర్మించాలని భావించగా, ప్రస్తుతం 250 ఇళ్లు పూర్తి కావొచ్చాయి. ఈ ఇళ్ల కోసం సుమారు 3 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఎక్కువగా ఉండటం, ఇళ్లు తక్కువగా ఉండటం అధికారులకు లబ్ధిదారుల ఎంపిక సవాల్‌గా మారనుంది. మరి పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ఇందిరమ్మ.. కట్టుకోలేమమ్మా..!

● భారంగా మారిన ధరలు

జహీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 'రాక. రాక ఇల్లు మంజూరైంది.. కట్టుకోకపోతే రద్దవుతది.. కట్టుకుందామంటే ధరలు మండుతున్నాయి.' ఇది ఇందిరమ్మ లబ్ధిదారుల ఆందోళన. సొంతింటి కలను నిజం చేసుకోవాలనుకున్న పేదలకు పెరుగుతున్న ధరలు అడ్డంకిగా మారుతున్నాయి. ప్రభుత్వం పెద్ద మనసుతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, వాటిని కట్టుకునేందుకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు పెరిగిన ముడిసరుకుల ధరలు చూసి దిక్కుతోచకున్నారు. ఇటు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాగానే, అటు వ్యాపారులు ముడిసరుకుల ధరలు పెంచడంతో ఇల్లు కట్టడం ఎలా అని ఆందోళన చెందుతున్నారు.

స్టీల్ క్వింటా 5,500

ఇంటి నిర్మాణానికి అవసరమైన అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయి. జిల్లాలో స్టీల్ క్వింటా రూ. 5,500 పలుకుతోంది. సిమెంట్ బస్తా రూ.350 నుంచి రూ.380 వరకు అమ్ముతున్నారు. ఇసుక టన్ను రూ. 2,500 నుంచి రూ.3,500 వరకు పెట్టాల్సి వస్తోంది. ఎర్రరారి ఒకటి రూ. 25, ఇటుక రూ. 9 చొప్పున దొరుకుతుంది. ఇప్పటికే స్కూల్ ఫీజులకు, వ్యవసాయ సీజన్‌లో పెట్టుబడులకు అప్పులు చేసిన వారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మరింత అప్పు ఎక్కడ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ. 5 లక్షలు సరిపోవని అంటున్నారు.

నియోజకవర్గానికి 3400 ఇళ్లు

జహీరాబాద్ నియోజకవర్గానికి 3,400 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 1,516 ఇళ్లకు మార్కింగ్ చేయగా, 142 బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. 15 ఇళ్లు రూఫ్ లెవల్‌లో.. మూడు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. సుమారు 86 ఇళ్లకు వివిధ దశలో నిధులు కూడా విడుదల చేసినట్లు గృహనిర్మాణశాఖ డీఈఈ అంజయ్య తెలిపారు.

స్నేహితుడి పుట్టిన రోజుకు వచ్చి.. మృత్యు ఒడికి

● కొండపోచమ్మ రిజర్వాయర్‌లో పడి ఒకరి మృతి



సాయి కృష్ణ(ఫైల్)

మర్కుక్/ములుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన సందర్భంగా సరదాగా గడిపేందుకు జలాశయానికి వచ్చిన ఆరుగురిలో ఒకరు నీట మునిగి చనిపోయారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కొండపోచమ్మ జలాశయం వద్ద మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు.. రంగారెడ్డి జిల్లా లింగంపల్లి మండలం చందానగర్ కాలనీకి చెందిన వెంకటేశం(23), సాయిప్రసాద్(24), ప్రణయ్‌కుమార్ (25), మహేష్ (22), సాయికృష్ణ (23), నవీన్(22)లు తమ స్నేహితుడు ప్రణయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా సరదాగా గడపడానికి కొండపోచమ్మ జలాశయం దగ్గరికి కారులో వచ్చారు. జలాశయం పైకి వెళ్లడానికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో కారును కిందనే పార్క్ చేసి నడుచుకుంటూ జలాశయం పైకి వెళ్లారు. ఈత కొడుదామని వీరంతా నీటిలోకి దిగారు. ఇందులో సాయికృష్ణ అనే యువకుడు జలాశయంలోని ఎక్స్‌కవేటర్ గుంతలో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండటంతో స్నేహితులు అతడిని కాపాడలేకపోయారు. డయల్ 100కు ఫోన్ చేయగా, గౌరారం రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్సై దామోదర్, ములుగు ఎస్సై విజయ్‌కుమార్ పోలీస్ బృందం వచ్చి గాలింపు చర్యలు చేపట్టింది. ఎంతకూ సాయికృష్ణ ఆచూకీ దొరకకపోవడంతో గజ ఈతగాళ్లను రప్పించగా, సుమారు నాలుగు గంటల తర్వాత మృతదేహం లభ్యమైంది. ఐదుగురు కలిసి వచ్చి అందులో ఒకరు మృత్యువాత పడటంతో ఆ స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇక పుట్టిన రోజు జరుపుకున్న ప్రణయ్‌కుమార్ రోదిస్తూ 'నా స్నేహితుడు సాయికృష్ణ మరణం కోలుకోలేని ఘటన అని, ఇక నా జీవితంలో మళ్లీ పుట్టిన రోజు వేడుకలు ఎప్పటికీ జరుపుకోను' అంటూ రోదించాడు. ఈ సందర్భంగా గౌరారం రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొండపోచమ్మ జలాశయం పైకి వెళ్లేందుకు అనుమతులు లేవని అన్నారు.

మెదక్‌లో మూడు దుకాణాలు దగ్ధం

● రూ. 3 లక్షల ఆస్తినష్టం





దగ్ధమైన దుకాణాలు

మెదక్ అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మెదక్ పట్టణంలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం, పట్టణంలో అంజనేయులు, నరేష్, నర్సింహులు కిరాణం, పండ్లు, సెలూన్ షాపులు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి వీరి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో దుకాణాల్లోని కిరాణ సామాగ్రి, పండ్లు, యంత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని నిర్ధారించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

కుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు



అక్కన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన భూంపల్లి అనసూర్య కిరాణా దుకాణానికి వెళ్తుండగా, వీధి కుక్క ఒక్కసారిగా వచ్చి దాడి చేసింది. దీంతో ఆమె చేతికి గాయమైంది. అక్కడి వారు ఆమెను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు

కల్హేర్/సిర్గాపూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిర్గాపూర్ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఒక ఆవు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి సాయిలు తన పాడి ఆవును గ్రామ శివారులో మేపుతుండగా, ఆవు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ తీగ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. రూ. 80 వేల విలువ గల పాడి ఆవుపై ఉన్న మమకారంతో రైతు సాయిలు ఆవు మీద పడి రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. బాధితుడు సాయిలును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

క్రైం కార్నర్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణ, హతుడు సబిల్(ఫైల్)

జాతీయ రహదారిపై హత్య

శివంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారికి అతి సమీపంలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు ముఖంపై బండరాయితో మోది హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా శివంపేట మండలం మగ్దుంపూర్ శివారులో మంగళవారం ఓ యువకుడిని దుండగులు ముఖం మీద బండతో కొట్టి చంపి బట్టలు లేకుండా నగ్నంగా పడేశారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ సీఐ రంగకృష్ణ సిబ్బందితో కలిసి పరిశీలించి జాగిలంతో తనిఖీలు నిర్వహించి విచారణ చేపట్టారు. మృతుడు హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన మహ్మద్ సబిల్(21)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో 2 వెండి చైన్లు, సిల్వర్ కలర్ వాచ్ ఉన్నాయని సీఐ రంగకృష్ణ తెలిపారు.

మద్యం మత్తు.. అతి వేగం..
ఇద్దరి ప్రాణాలు తీసింది

● నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేట అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు, అతి వేగం ఇద్దరి ప్రాణాలు తీసింది. రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెల మరణానికి కారణమైన నిందితుడిని మంగళవారం త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ విద్యాసాగర్ వారి వివరాలను వెల్లడించారు. ఈ నెల 21న సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతోష్ కుమార్ (26) అతని కుమార్తె ఝాన్సీ (4) మృతి చెందిన విషయం తెలిసిందే. మిట్టపల్లి గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి మణిసాయి, సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన సామలేటి పవన్ కుమార్‌లు కారులో మేడ్చల్ వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యంలో ఓ వైన్స్ వద్ద మద్యం తాగారు. అక్కడి నుంచి రంగధాంపల్లి సమీపంలోని వైన్స్ వద్ద కూడా మద్యం తాగారు. రెండవసారి మద్యం తాగిన తర్వాత పవన్ కుమార్‌ని సిద్దిపేటలో దింపిన కొమ్మిశెట్టి మణిసాయి, మిట్టపల్లి గ్రామానికి వస్తుండగా, కారు అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ సంతోష్‌కుమార్, ఝాన్సీలు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ఇద్దరూ చనిపోయారు. ఈ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ కోసం కోర్టు ఎదుట హాజరుపరిచారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

తూప్రాన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నాయి, వ్యవసాయ పనులు మంచిగా చేసుకో అని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం నాగులపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం, నాగులపల్లికి చెందిన ఏశబోయిన ఎల్లంకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు ఏశబోయిన శ్రీనివాస్ (30)ను ఆర్థిక ఇబ్బందులున్నాయని, వ్యవసాయ పనులు బాగా చేసుకోవాలని తండ్రి మందలించాడు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఈనెల 19న ఇంట్లో వాళ్లు బయటకు రాకుండా గడియపెట్టి ఇంటి పైకి వెళ్లి పురుగుల మందు సేవించాడు. కుటుంబీకులు కేకలు వేయడంతో చుట్టుపక్కల కుటుంబాల వారు వచ్చి తలుపు గడియ తీయడంతో పురుగుల మందు సేవించిన శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని నారాయణ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి ఎల్లం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

జిన్నారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోంచి బయటకు వెళ్లిన వృద్ధురాలి మృతదేహం లభించింది. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డపోతారం చెందిన సూరారం బాలమణి(60) ఈ నెల 14న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం గడ్డపోతారం శివారు 79సర్వే నెంబరులోని నీటి కుంటలో బాలమణి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకొని వారు బాలమణి శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనిల్ హత్య కేసులో మరో నిందితుడు అరెస్ట్



నిందితుడని విలేకరుల ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు

మెదక్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ హత్య కేసులో మరో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ ప్రసన్నకుమార్ రూరల్ సీఐ రాజేశేఖర్‌రెడ్డితో కలిసి నిందితుడి వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న కొల్చారం మండలం వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో మారెల్లి అనిల్‌ను దారుణంగా కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-1 ముద్దాయిగా ఉన్న సోమన్నగారి రవీందర్‌రెడ్డితోపాటు నాగరాజు, నాగభూషణం, ఫరీద్, అశోక్‌లను సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. విజయవాడకు చెందిన షాబొద్దీన్, మరో నిందితుడు చిన్నా పరారీలో ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. అనిల్ కారులో ఉండగా, షాబొద్దీన్ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అతనిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయగా, మంగళవారం అతడినీ అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అయింది.మరో నిందితుడు చిన్నాను కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

సంగారెడ్డిలో చైన్ స్నాచింగ్

● సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు

సంగారెడ్డి క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని అయ్యప్పకాలనీ రోడ్ నంబరు 1లో మంగళవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... అందోల్ మండలం డాకూరు గ్రామానికి చెందిన ఇందూరి నర్సింహులు సంగారెడ్డిలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. సంగారెడ్డి పట్టణంలోని అయ్యప్పకాలనీ రోడ్ నంబరు 1లో రెండేళ్ల నుంచి భార్య ఇందూరి లక్ష్మి, కూతురుతో కలిసి నివాసముంటున్నారు. మంగళవారం సాయంత్రం 4.15 గంటలకు ఇందూరి లక్ష్మి తన కూతురును పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి లక్ష్మి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. దుండగులు చైన్ స్నాచింగ్ చేస్తున్న దృశ్యాలు అక్కడి పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ అయిన బంగారు గొలుసు మూడు తులాలు వుంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ధ్వంసమైన బీరువా

నంగునూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం దర్గాపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. రాజగోపాలపేట పోలీసుల కథనం ప్రకారం, దర్గాపల్లి గ్రామానికి చెందిన చాడ శ్రీనివాస్ రెడ్డి తన భార్యతో కలిసి ఈ నెల 21న హైదరాబాద్‌లోని తన కూతురు దగ్గరకు బోనాల పండుగకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 12 తులాల వెండి, పట్టీలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

మనోహరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం రంగయపల్లి గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రంగయపల్లి శివారులోని బొట్లగడ్డ వద్ద రైతుల పొలాల వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ కాయిల్స్, ఆయిల్ చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

యూరియా పరిమితం

- వినియోగం తగ్గించేందుకు చర్యలు
- నానో యూరియాపై అవగాహన
- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

కొండపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం యూరియా పంపిణీని సైతం పరిమితం చేసింది. యూరియా వినియోగం వల్ల నష్టాలేనని భావిస్తోన్న సర్కారు ఈసారి రైతు పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా ఎకరాకు ఒక బస్తా మాత్రమే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. మరో పక్క నానో యూరియా వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. యూరియా కంటే నానో యూరియా వినియోగిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెబుతున్నారు.

ధరల భారం..

ప్రైవేట్ వ్యాపారులు యూరియా ధర పెంచి విక్రయిస్తున్నారు. ఆగ్రోస్ సేవా కేంద్రాల్లో యూరియా బస్తా ధర రూ. 280 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ. 300లకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఈ ధర ఇంకా పెరుగుతోంది. ఇక నిబంధనల ప్రకారం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆగ్రోస్ సేవా కేంద్రాల్లో, పీఏసీఎస్‌లలో ఎకరాకు ఒక బస్తా చొప్పున సాధారణ యూరియాను అందజేస్తున్నారు.

మోతాదుకు మించి వద్దు

యూరియా వినియోగంపై వ్యవసాయ అధికారులతో పాటు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మోతాదుకు మించి యూరియా వినియోగించవద్దని చెబుతున్నారు. యూరియాలో ఉండే నత్రజని పంటకు ఎక్కువగా అవసరమని, అయితే, యూరియా పొలంలో వేసిన వెంటనే నీటిలో కరిగి భూమి పొరల్లోకి.. భూగర్భ జలాల్లోకి చేరి నష్టం జరుగుతోందని వివరిస్తున్నారు. కొంత గాలిలో కూడా ఆవిరైపోతుందని, ఇలా వృథాగా పోయిన తర్వాత కేవలం 30 నుంచి 35 శాతం యూరియా మాత్రమే పంటలకు అందుతుందని అంటున్నారు. ఇక యూరియా మోతాదుకు మించి వేయడం వల్ల మొక్కలు పెళుసుబారుతాయని, పురుగులను ఎక్కువగా ఆశిస్తాయని, రోగాలకు గురవుతాయని వివరిస్తున్నారు. యూరియాను ఒకేసారి కాకుండా తక్కువ మోతాదులో 3 నుంచి నాలుగు సార్లు వేసుకోవాలని సూచిస్తున్నారు. యూరియాతో పాటు భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు కూడా పంటకు అవసరం ఉంటుందని, వీటి ధర ఎక్కువ కావడంతో రైతులు వీటి వినియోగానికి పెద్దగా మొగ్గు చూపకుండా, యూరియాను కుమ్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల నేల నిస్సారంగా మారడంతో పాటు పంటలు చీడపీడల బారిన పడి రైతుకు తగిన ఫలితం రావడం లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



అర లీటర్ నానో.. ఒక బస్తాతో సమానం

యూరియా స్థానంలో నానో యూరియా వినియోగించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అర లీటరు నానో యూరియా డబ్బా ఒక యూరియా బస్తాతో సమానమని చెబుతున్నారు. నానో యూరియా వినియోగం వల్ల భూమి, నీరు, వాతావరణ కాలుష్యం రక్షించవచ్చునని, నానో యూరియా విరివిగా వినియోగించి పంటల దిగుబడి పెంచుకోవాలని సూచిస్తున్నారు.

యూరియాకు ప్రత్యామ్నాయం

యూరియాకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో అనేక ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. అందులో భాగమే నానో యూరియా. నానో డీఏపీ. వీటిని నీటిలో కలిపి పిచికారి చేయాలి. అలాగే, 19:19:19, 20:20:20, 52, 13-0-45 ద్రవరూప నత్రజని ఎరువు వంటివి అందుబాటులో ఉన్నాయి. దుక్కిలో సిఫారసుల మేరకు కాంప్లెక్స్ ఎరువులను వేసుకొని, పైరుపై పిచికారీ చేస్తే తక్కువ ఖర్చు, తక్కువ ఎరువుల నష్టంతో మంచి ఫలితాలు వస్తాయి. ఉదాహరణకు వరిలో పిలకలు పెట్టే దశలో నానో యూరియా, నానో డీఏపీ స్ప్రే చేసుకోవచ్చు. చిరుపొట్ట దశలో నానో యూరియా, 13-0-45 కలిపి స్ప్రే చేసుకుంటే తక్కువ ఖర్చులో మంచి ఫలితాలు వస్తాయి. పైరుపై స్ప్రే చేసే ఎరువుల వాడకం వలన చీడల సమస్య తగ్గుతుంది. రైతులకు శ్రమ, ఖర్చు తగ్గుతుంది. పంటలకు వివిధ దశలలో అవసరమైన పోషకాలు నేరుగా ఆకులకు అందించి అధిక దిగుబడులను పొందవచ్చు.

పంటను బట్టి యూరియా వాడాలి



యూరియా వినియోగం అనేది పంటను బట్టి మారుతూ ఉంటుంది. వరి పంటకు యూరియాను బురద పదునులో వేయాలి. దీని వల్ల యూరియా నుంచి విడుదలైన అమ్మోనియా నేలకు అంటిపెట్టుకొని వేర్లకు అందుబాటులో ఉంటుంది. ఆరుతడి పైర్లకు యూరియా వేసినప్పుడు భూమిపైన కాకుండా మొక్కల దగ్గర గుంత తీసి అందులో వేసి మట్టితో కప్పివేయాలి. పెద్ద గుళికల యూరియాను వరి పైరుకు వేయడం వల్ల నత్రజని లభ్యత ఎక్కువ రోజులు ఉంటుంది. ఆరుతడి పంటలకు సన్నగుళికల యూరియా వేసుకోవడం వల్ల తేమ తక్కువగా ఉన్నప్పటికీ తొందరగా కరిగి మొక్కకు అందుతుంది. చౌడు నేలల్లో పండించే పంటలకు యూరియాను తక్కువ మోతాదులో ఎక్కువసార్లు వేయడంతో పాటు యూరియాను పిచికారీ చేయాలి. నానో యూరియా వంటి ఎరువులను వాడటం వల్ల పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చు.

-శివరామకృష్ణ మండల వ్యవసాయ శాఖ అధికారి



యూరియా కొరత సృష్టిస్తే పీడీ యాక్ట్

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

శివ్వంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని, ఎవరైనా కొరత సృష్టించినా.. రైతులను తప్పుదారి పట్టించినా పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. జిల్లాలో ఐదు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. మంగళవారం కలెక్టర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. ఇక్కడ వంద సంచుల యూరియా ఎక్కువ చూపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు యూరియా ఇవ్వకుండా పరిశ్రమలకు అక్రమంగా విక్రయించాలని చూస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మీడియా కూడా..

వ్యవసాయ శాఖను సంప్రదించకుండా మీడియాలో యూరియా కొరత ఉన్నట్లు కథనాలు రాస్తే కూడా చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో కావాల్సిన దానికంటే ఎక్కువ యూరియా స్టాక్ ఉందన్నారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాల్సిందిగా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఏవో లావణ్య, సీఈవో మధు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- పెద్దశంకరంపేటలో కరెంటు కోతలపై బీఆర్ఎస్ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కరెంటు కోతలకు నిరసనగా రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తున్నారని విమర్శించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ నాయకులు మాణిక్‌రెడ్డి, సురేశ్ గౌడ్, కన్నయ్య, రమేశ్, బూత్కూరు సుభాష్, యాదుల్, శంకరయ్య, కోనమంజయ, శంకర్‌గౌడ్, బొండ్ల దత్తు, బెజవాడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



మట్టి టిప్పర్లు వెళ్లకుండా రోడ్డుపై అడ్డుగా నిల్చున్న గ్రామస్థులు

పాపన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏడుపాయల్లోని కొల్చారం మండలం వైపు తమ వెంచర్‌ను చదును చేసుకోవడం కోసం ప్రైవేట్ వ్యక్తులు పదుల సంఖ్యలో టిప్పర్లలో మట్టిని తరలించడంతో నాగసానిపల్లి గ్రామంలోని అంతర్గత రోడ్లు, మిషన్ భగీరథ నీటి పైపులు పాడవుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు మంగళవారం టిప్పర్లను అడ్డుకున్నారు. గత వారం రోజులుగా టిప్పర్లు తిరుగుతుండడంతో గ్రామంలోని రోడ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ వచ్చేంతవరకు టిప్పర్లను వదిలిపెట్టమని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కలెక్టర్ అనుమతి ఉన్నందున టిప్పర్లు నడుస్తున్నాయని, అడ్డుకోవద్దని సూచించారు. రోడ్లు పాడవుతున్న విషయంపై తాము కూడా కలెక్టర్‌ను కలిసి తెలియజేస్తామని గ్రామస్థులు అన్నారు. పోలీసుల జోక్యంతో గ్రామస్థులు రోడ్డుపై నుంచి పక్కకు తప్పుకోవడంతో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు యథావిధిగా నడిచాయి.

మెదక్ జిల్లాలో 84 మంది బాలలకు విముక్తి



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, బాలలు బడులకు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ శాఖ సమన్వయంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి, వారిని తల్లిదండ్రులకు, సంరక్షణ కేంద్రాలకు తరలించి, యాజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుందన్నారు. 20 రోజుల్లో జిల్లావ్యాప్తంగా 84 మంది బాలలను రక్షించి, యాజమానులపై 50 కేసులు నమోదు చేశామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు కమ్రొద్దీన్

బ్యాక్ బెంచర్స్ ఉండకూడదని..

లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో యూ సీటింగ్

కంది, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో బ్యాక్ బెంచ్‌లు యూ ఆకారంలోకి మారిపోయాయి. బ్యాక్ బెంచ్ స్టూడెంట్స్ ఉండకూడదనే ఉద్దేశంతో మంగళవారం కందిలోని లక్ష్మీనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. ఇటీవల కేరళలో విడుదలైన మళయాళీ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్' క్లైమాక్స్ సీన్ స్ఫూర్తితో ఆ రాష్ట్రంలోని కొల్లం జిల్లాలోని రామవిలాసం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో అక్కడి విద్యాశాఖ ఈ విధానాన్ని ప్రారంభించారు. ఇది సత్ఫలితాలను ఇస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కేరళతోపాటు ఒడిశా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో యూ ఆకారం బోధనలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. యూ ఆకారం సీటింగ్‌తో విద్యా బోధన చేస్తే మెరుగైన ఫలితాలు రావొచ్చనే ఉద్దేశంతో జిల్లా ఉపాధ్యాయులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో సమానత్వం, చదువు పట్ల ఆసక్తి పెంపొందించవచ్చని ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు.

'ఆర్టిజన్ల కన్వర్షన్‌తో ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉండదు'



వంటావార్పులో ఆర్టిజన్ కార్మికులు

సంగారెడ్డి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వానికి గానీ, మేనేజ్‌మెంట్‌కు గానీ ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు స్పష్టం చేశారు. టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వద్ద ఆర్టిజన్ కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో పనిచేస్తున్న 19,600 మంది ఆర్టిజన్ కార్మికులను వారి విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, అన్ని సంస్థల్లో ఒకే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరని పక్షంలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేందుకు సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ, ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సాధన కోసం చేపట్టే పోరాటాలకు సీఐటీయూ పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని, భవిష్యత్తులో సమ్మెకు వెళ్లినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ నరేందర్, సిద్దిపేట, మెదక్ జిల్లాల చైర్మన్లు సుధాకర్, స్వామి, ప్రశాంత్, నాయకులు కనకరాజు, దుర్గేశం, మల్లేశం, జయపాల్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు శాస్త్రవేత్తలుగా విద్యార్థులు



హైదరాబాద్‌లోని ఐఐసీటీలో ప్లాంట్ వద్ద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కంది, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల మన్ కీ బాత్‌లో ప్రసంగిస్తూ విద్యార్థులు ప్రయోగశాలలో ఒక్కరోజు శాస్త్రవేత్తగా గడపాలని సూచించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన పరిశోధక సంస్థ ఐఐసీటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) 8,9,10వ తరగతుల విద్యార్థులకు అవకాశం కల్పించింది. అయితే కంది మండలం (ఓడీఫ్) ఆయుధ కర్మాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 11 మంది ఈ అవకాశాన్ని పొందారు. వీరిని గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు మంగళవారం హైదరాబాద్‌లోని ఐఐసీటీ సంస్థకు తీసుకువెళ్లారు. విద్యార్థులకు పరిశోధన వాతావరణాన్ని పరిచయం చేయడం, శాస్త్రవేత్తలతో చర్చించే అవకాశాన్ని కల్పించారు. క్విజ్ నిర్వహణ, వివిధ ప్లాంటుల సందర్శన మొదలైన కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరోజు శాస్త్రవేత్తలుగా వ్యవహరించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి వాణి, ఇతర ఉపాధ్యాయులు రజిత, విజయభాస్కర్, రవీందర్, చవాన్ సుభాన్ సింగ్, సంధ్య, తల్లిదండ్రులు అభినందించారు.

సర్కారు బడిలో సొంత ఖర్చుతో 'నిఘా'

ముస్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సొంత నిధులు రూ.లక్షతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో విద్యాసాగర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. తరగతి గదులతో పాటు వరండా, పాఠశాల చుట్టూ పూర్తిగా కవరయ్యేలా 16 సీసీ కెమెరాలు బిగింపజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల భద్రత దృష్ట్యా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



ఉపాధి చూపేవారికే వేతనాల్లేవు

- మూడు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- అమలుకు నోచుకోని పేస్కేల్ హామీ
- మెదక్ జిల్లాలో 408 మంది ఉద్యోగులు, సిబ్బంది



వేతనాల కోసం డీఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు, సిబ్బంది(ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కేంద్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది వేతనాల కోస నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఏపీవోలకు పేస్కేల్ అమలు చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క 2 ఫిబ్రవరి 2024లో హామీ ఇచ్చారు. 17 నెలలు దాటినా మంత్రి హామీ అమలు కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు సమ్మె నోటీసును సైతం అందజేశారు.

సకాలంలో వేతనాలు రాక..

ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు వంద రోజులపాటు పనులు కల్పించడంలో ఎఫ్ఏ(ఫీల్డ్ అసిస్టెంట్ల)లది పాత్ర కీలకం. కానీ వేతనాలు సకాలంలో రాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇతర సిబ్బందికి సైతం నెలనెలా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 67,413 కుటుంబాలు, 1,08,688 మంది కూలీలు ఉండగా, 17,86,048 పని దినాలు కల్పించారు.

408 మంది ఉద్యోగులు, సిబ్బంది..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పర్యవేక్షణలో ఉపాధి హామీ పథకంలో ఎపీవో, ఈసీ, టీఏ, ఎఫ్ఏ, కంప్యూటర్ ఆపరేటర్లు, డీఆర్డీఏ కార్యాలయ సిబ్బంది మొత్తం 408 మంది పని చేస్తున్నారు. అందులో ఎఫ్ఏలు 250 మంది, టీఏలు 80, కంప్యూటర్ ఆపరేటర్లు 40, ఈసీలు 14, ఏపీవోలు 14, ఆఫీస్ సిబ్బంది 10 మంది ఉన్నారు. వీరంతా గ్రామాల్లో సంవత్సరానికి సరిపడా ఉపాధి పనులు గుర్తించి జాబ్ కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పిస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు నూతనంగా గుర్తించిన పనులకు అంచనాలు వేయడం, పని ప్రదేశాల్లో కొలతులు వేడయం, రికార్డుల నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వర్తిస్తారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో మస్టర్లు పొందుపర్చడం, ఎఫ్ఏలకు మస్టర్లు ఇవ్వడం, నిధులు జనరేట్ చేయడం, ఈసీలు, ఏపీవోలు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు.

నెలనెలా వేతనాలు అందించాలి



ఉపాధి హామీ పథకంలో పని చేస్తే ప్రతి ఒక్కరికి నెల నెలా వేతనాలు మంజూరు చేయాలి. మూడు, నాలుగు నెలలకోసారి జీతాలు ఇస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించి, పే స్కేల్‌ను వర్తింపచేయాలి.

-రాజ్‌కుమార్, జేఏసీ చైర్మన్ మెదక్

ప్రక్రియ కొనసాగుతోంది..

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు మూడు నెలలవి చెల్లించాల్సి ఉంది. బిల్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. రెండు, మూడు రోజులుగా చెల్లించే ప్రక్రియ కొనసాగుతోంది.

- శ్రీనివాసరావు, డీఆర్డీవో మెదక్

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం నుండి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 21 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 21 మందికి రూ.46,500 జరిమాన విధించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బెజ్జంకి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ సౌజన్య సూచించారు. మండలంలోని దాచారం స్టేజీ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు చలానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శంకర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేబర్తిలో ముక్త్ భారత్

మద్దూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పీఎం ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి చేర్యాలకు పంపించడం జరిగిందని టీబీ సూపర్‌వైజ్ వలిపాష తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా సోమయాజుల కుంట కట్టపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై సురేష్ ఈత మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో డ్రైడేను పురస్కరించుకుని ఇళ్లల్లో నిలువ చేసిన నీటిని పారబోశారు.

నిజాం నిరంకుశత్వంపై పోరాడిన దాశరథి

గజ్వేల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశత్వంపై పోరాడిన గొప్ప వ్యక్తి దాశరథి అని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్. గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి శత జయంతి వేడుకలలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో దాశరథి జీవితం-సాహిత్యం అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణ దిక్కారస్వరంగా, నిజాం నిరంకుశత్వాన్ని నిరసించిన అభ్యుదయ వాదిగా పేరుగాంచారన్నారు. కవిత్వంలో ప్రజా చైతన్యాన్ని దాశరథి నుంచి నేటి విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు.

పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు

కోహెడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మండల మహిళా సమైక్య సంఘాల మహిళలకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా వైద్యాధికారి లీమా ఆధ్వర్యంలో మహిళలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మండలంలోని 29 మహిళా సంఘాల నుంచి సుమారు 1500 మంది మహిళలు హాజరయ్యారని ఏపీవో తిరుపతి తెలిపారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జి రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సీడీఈ)లో 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ పీజీ కోర్సుల్లో మొదటి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీజీఆర్‌ఆర్‌సీడీఈ కోఆర్డినేటర్ డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. బి.ఏ, బీ.కాం, బీ.ఎస్సీ, బి.బి.ఎం డిగ్రీ కోర్సులతో పాటు ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఏ, ఎం.కామ్, రెండు ఎంఎస్సీ కోర్సులు, పీజీ డిప్లమా, అడ్వాన్స్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, ఫీజులు, ఇతర వివరాలకు ఉస్మానియా యూనివర్శిటి వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు 9440884089 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి చేయూత

చేర్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన గీత కార్మిక కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ చేయూతనందించింది. కొన్ని నెలలక్రితం గీతకార్మికుడు బొందుగుల చంద్రశేఖర్ తాటిచెట్టుపై నుంచి పడి మంచానపడ్డాడు. నడుము విరిగి స్పర్శ కోల్పోయి అచేతనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. కల్లుగీత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, బాల్నె వెంకట మల్లయ్య ట్రస్ట్‌సభ్యులకు వివరించడంతో అసోసియేషన్ సభ్యులు స్పందించారు. అతడి భార్య జీవనోపాధి నిమిత్తం కుట్టుమిషన్‌ను విరాళంగా అందజేశారు. మంగళవారం కల్లు గీత కార్మికసంఘం నాయకులు వడ్లకొండ వెంకటేష్, తాళ్లపల్లి రాజు, పచ్చిమడ్ల రాములు తదితరులు అప్పగించారు.

రోడ్డు విస్తరణ జరిగేనా?



ఇళ్ల మధ్యలో ఇరుకుగా ఉన్న రోడ్డు

● నిధులున్నా.. జరగని పనులు ● రోడ్డు విస్తరణకు ఒప్పుకోని గ్రామస్థులు

మర్కుక్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాలకు మంచి రోడ్లు వేయాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 60 ఫీట్లతో రోడ్డు వేయాల్సి ఉంది. ఈ మేరకు గ్రామాల బయట రెండు వైపులా పనులు పూర్తయ్యాయి. కానీ, గ్రామంలో మాత్రం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కారణం.. గ్రామంలో అంత వెడల్పు రోడ్డు అవసరం లేదని, ఉన్నంతలో విస్తరిస్తే చాలని అంటుండంతో పనులు ముందుకు సాగడం లేదు.

మండలంలోని పాములపర్తి గ్రామాన్ని 2015 మే 10న మాజీ సీఎం కేసీఆర్ ఆకస్మికంగా సందర్శించారు. అప్పటి సర్పంచ్ మ్యాకల చంద్రకళ కనకయ్య, ఎంపీటీసీ రాజేశ్, గ్రామస్థుల అభ్యర్థన మేరకు మర్కుక్ నుంచి పాములపర్తి, పాతూరు మీదుగా ప్రజ్ఞాపూర్ వరకు రహదారి కోసం రూ. 11 కోట్లు మంజూరు చేశారు. అధికారులు మర్కుక్ నుంచి పాములపర్తి, పాతూరు మీదుగా ప్రజ్ఞాపూర్ వరకు రెండు వరుసల రహదారిని నిర్మించారు. ఇందుకు రూ. 5 కోట్లు ఖర్చు చేశారు. అయితే, గ్రామంలో రోడ్డుకు ఆనుకుని ఇళ్లు ఉండటంతో గ్రామస్థులు రోడ్డు విస్తరణకు ముందుకు రాలేదు. నిబంధనల ప్రకారం గ్రామంలో 60 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరించాలి. పాములపర్తిలో 600 మీటర్లు, పాతూరులో 550 మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అయితే, రోడ్డు విస్తరణలో తమ ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందనే ఉద్దేశంతో గ్రామస్థులు విస్తరణకు ససేమిరా అన్నారు. ఇప్పుడున్న రోడ్డును బాగు చేసి, మురికికాలువలు నిర్మిస్తే చాలని రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. దీంతో రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు.

స్వచ్ఛందంగా తొలగించా..

రహదారులు అభివృద్ధి చెందితేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. నేను స్వచ్ఛందంగా మా పాత ఇంటిని కూల్చి వేశా. గ్రామంలో రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. గ్రామస్థులంతా రోడ్డు విస్తరణకు సహకరించాలి.

-గుర్రాల బిక్షపతి, పాతూరు

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..

పాములపర్తి, పాతూరు గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. పంచాయతీరాజ్ శాఖ తరపున నష్టపోయిన ఇళ్లకు పరిహారం ఇచ్చే పరిస్థితి లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనలతో త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం.

- అశోక్‌కుమార్, ఎంపీడీవో (మర్కుక్)

బీఎస్పీని ఆదరించండి

హుస్నాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు, బహుజనులకు న్యాయం జరుగాలంటే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కోరారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేట్ పోస్టులను బీసీలకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అలాగే బీజేపీ బీసీల బిల్లు తేవడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు ఎలగందుల శంకర్, మొగిలిపాక శ్రీనివాస్, సాంబరాజు తదితరులున్నారు.

సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

సిద్దిపేట క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైన్స్ అండ్ జువాలజీ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి సిద్దిపేట జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి వినతి పత్రం సమర్పించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంలో అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని, సీఎం దృష్టికి తీకెళ్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్లో , మెదక్ సిద్దిపేట రాజన్న సిరిసిల్ల జోన్ లో కలపడం వల్ల ఉద్యోగులు ప్రమోషన్లలో గాని మిగతా విషయాలలో గాని నష్టపోయారని ఈ విషయంపై మంత్రికి సిద్దిపేట టీఎన్జీవోస్ జిల్లా పక్షాన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సిద్దిపేట జిల్లా సహాధ్యక్షులు నిమ్మా సురేందర్ రెడ్డి, కలెక్టరేట్ అధ్యక్షులు నాగేష్, కార్యదర్శి సుమన్, తదితర ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిద్దిపేటలో ప్రొటోకాల్ రగడ

(5వ పేజీ తరువాయి)

మూడు నెలలకోసారి డీఆర్సీ సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అవమానంగా భావిస్తున్నా : బక్కి వెంకటయ్య

సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానించి తనకు చైర్ వేయలేదని, సమావేశంలో టేబుల్ ముందు నేమ్ బోర్డు ఏర్పాటు చేయకపోవడం పట్ల తనను అవమానం జరిగినట్లుగా భావిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య చెప్పారు. అలాంటప్పుడు కార్యక్రమానికి ఎందుకు ఆహ్వానించారని మండిపడ్డారు. దళితుడినైనా తనకే న్యాయం జరగకపోతే, ఇక ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఏలా న్యాయం చేస్తానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా మంత్రి వివేక్ మాట్లాడుతూ మరో మారు ఇలా జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ హైమావతిని ఆదేశించారు.



కుర్చీ లేకపోవడంతో వెనకాల నిలబడ్డ ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య(ఎడమ), కుర్చీ అప్పటికప్పుడు వేస్తున్న సిబ్బంది (కుడి)

మైక్రోఫైనాన్స్‌ల మాయాజాలం

(5వ పేజీ తరువాయి)

ఈ సంస్థలు, రుణం సకాలంలో చెల్లించకుంటే ఇంటి వద్దకు వచ్చి గొడవ చేస్తారని బాధితులు భయపడుతున్నారు.

ఆగని వేధింపులు

మైక్రో ఫైనాన్స్ సంస్థలు తమ వ్యాపారాలను పెంచుకునేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తరించాయి. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోనే వందకు పైగా సంస్థలు ఉండగా, మిగతా నాలుగు మున్సిపల్ పట్టణ కేంద్రాల్లో వందలాది ఫైనాన్స్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను లక్ష్యంగా చేసుకొని రెచ్చిపోతున్నారు. రుణాలు పొందిన తర్వాత రెండు, మూడు వాయిదాలు చెల్లించకుంటే, రుణగ్రహీతల ఇంటి ముందు గొడవ పెట్టి, రెండు, మూడు రోజుల్లో చెల్లించాలని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ చెల్లించకపోవడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్, వాహనాలను తీసుకెళ్తున్నారు. ఎవరికైనా చెప్పుకుందామనుకుంటే, గ్రామాల్లో తమ పరువు ఎక్కడ పోతుందోనని ఆవేదన చెందుతూ, తీసుకున్న రుణాలు చెల్లించేందుకు ఇంట్లోని బంగారం, తెలిసినవారి వద్ద చేబదులు తీసుకొని అప్పులు తీర్చుకుంటున్నారు. అధిక వడ్డీ తీసుకొని వ్యాపారాలను సాగిస్తున్న పలు సంస్థలపై అధికారులు చర్యలు చేపట్టాల్సింది పోయి, పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అచ్యుతానందం పోరాటాలు చిరస్మరణీయం

గజ్వేల్/సిద్దిపేట అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):కేరళ మాజీ ముఖ్యమంత్రి సీపీఎం వ్యవస్థాపక సభ్యుడు కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ పోరాటాలు చిరస్మరణీయంగా మిగిలిపోతాయని సిద్దిపేట జిల్లా సీపీఎం కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. ఈ నెల 21న అనారోగ్యంతో మృతి చెందిన అచ్యుతానంద చిత్రపటానికి మంగళవారం సిద్దిపేటలో సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతనందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ప్రజా జీవితంతో నిండిన ఆదర్శ కమ్యూనిస్ట్ యోధుడని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అచ్యుతనందన్ కేరళ ముఖ్యమంత్రిగా ఓ సారి, ఐదు సార్లు ఎంఎల్‌ఏగా, రెండు సార్లు ప్రతిపక్ష నేతగా గొప్ప సేవలందించారన్నారు. క్రమశిక్షణ కలిగిన ఆదర్శ కమ్యూనిస్ట్ యోధుడన్నారు.

జీవితాలను పాడు చేసుకోవద్దు

దౌల్తాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మద్యం గంజాయి సిగరెట్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం దొమ్మాట జడ్పీ పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం బాసిత్ ఆధ్వర్యంలో ఎస్సై అరుణ్ కుమార్ మత్తు పదార్థాలు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంగ మహేందర్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు క్రీడ దుస్తులను అందజేశారు. అనంతరం ఎస్సై అరుణ్ కుమార్ మాట్లాడుతూ. సైబర్ నేరాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

నానో యూరియాతో తక్కువ ఖర్చు, అధిక దిగుబడి

రాయపోల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడటం వల్ల ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని గజ్వేల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ) బాబూనాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాయపోల్‌లోని పంట చేలల్లో ఏఓ నరేష్‌తో కలిసి నానో యూరియాపై అవగాహన కల్పించారు. నానో యూరియా సాధారణ యూరియాపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ హితం నైట్రోజన్ లీచింగ్ తగ్గి మట్టి, నీటి కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. లీటర్ నీటికి 2 నుంచి 4 మిల్లీ లీటర్లు కలిపి స్ప్రే చేయాలని, పంట కాలంలో రెండు సార్లు ఉపయోగించడం మేలని పేర్కొన్నారు. నానో యూరియా వరి, గోధుమ, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, పప్పుదినుసులు, నూనె గింజల పంటల్లో వేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఏఈఓలు, ఇఫ్కో ప్రతినిధి చంద్రబాబునాయుడు, రైతులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక లాభాలు

చిన్నకోడూరు/సిద్దిపేటరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టు సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు వినోద్ కుమార్, రాఘవేంద్ర, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్, నారాయణరావుపేట మండలం గోపులాపూర్, జక్కాపూర్ గ్రామాల్లో మంగళవారం శాస్త్రవేత్తలు, అధికారులు పర్యటించి బేస్ లైన్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మల్బరీ తోటలు, పట్టు పురుగుల షెడ్‌లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పట్టు సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, నూతన టెక్నాలజీ వినియోగం తదితర అంశాల పై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి రేణు శర్మ, పట్టు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.



చంద్లాపూర్‌లో మల్బరీ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

బంద్ కరపత్రాల ఆవిష్కరణ

చేర్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న చేపట్టనున్న చేర్యాల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను మంగళవారం జేఏసీ చైర్మన్ రామగల్లపరమేశ్వర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేఏసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేర్యాల అస్తిత్వ సాధన కోసం రాజకీయాలకతీతంగా నిర్వహిస్తున్న పోరాటంలో అన్నివర్గాలు భాగస్వాములవ్వాలని కోరారు. చేర్యాల బంద్‌లో వర్తక, వ్యాపార,వాణిజ్య, విద్యాసంస్థలు సహ కరించి రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను చాటాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, ససవాల ప్రసాద్, ఈరు భూమయ్య, జంగిలి యాదగిరి, వలబో జు నర్సింహ్మాచారి, పొన్నబోయిన మమల, పోలోజు వెంకటాద్రి, ఎక్కలదేవి సుధాకర్, నంగి కనకయ్య, పొనేగోటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా ముత్యాలమ్మ జాతర



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఏటిగడ్డ కిష్టాపూర్‌లో సీత్లా ముత్యాలమ్మ జాతర

అక్కన్నపేట/కోహెడ/గజ్వేల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సీత్లా ముత్యాలమ్మ జాతరను ఘనంగా ఘనంగా నిర్వహించుకున్నారు. సీత్ల భవాని పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆషాడ మాసంలో ఇలా ప్రతి సంవత్సరం మంగళవారం రోజు మాత్రమే జరపడం ఆనవాయితీగా వస్తోంది. తండాలో సరిహద్దుల్లోని పొలి మేరల కూడలి వద్ద సీత్ల భవానీని ప్రతిష్టిస్తారు. పురుషులంతా డప్పు, వాయిద్యాలు వాయిస్తూ కోళ్ళ, మేకలతో; మహిళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అమ్మవారు ఉన్న ప్రదేశానికి వెళ్తారు. అక్కన్నపేట మండలంలోని చౌటకుంటతండాలో గిరిజనులు మంగళవారం సీత్లా భవానీ ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఇష్టారాజ్యం

నంగునూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లో కాంగ్రెస్ నాయకులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని నంగునూరు మండల బీజేపీ నాయకులు ఆరోపించారు.. మంగళవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు అయిన బీజేపీ కార్యకర్తల ఇళ్లను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజల సొంతింటికల నేరవేర్చాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లను పేదలు కట్టుకుంటుంటే బీఆర్ఎస్ నేతల కళ్లమండు తున్నాయని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

జాతీయ పథాక ఆమోదిత వేడుకలు



చీలాపూర్‌లో జాతీయ పథకాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బెజ్జంకి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీలాపూర్ ప్రాథమిక పాఠశాలలో బెజ్జంకి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పథక ఆమోదిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు జాతీయ పథకాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ రవీంద్ర ప్రసాద్ మాట్లాడారు. జాతీయ పథాక రూపకల్పన, ప్రాముఖ్యత, గౌరవం, దేశ భక్తి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లికార్జున్, హరీశ్, శరత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూనిర్వాసితుల సమస్యలకు పరిష్కారం

గజ్వేల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖా మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా పర్యటనకు వచ్చిన అయనను గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లు కలసి మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వారితో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, అంజత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్ తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లను చట్టం ద్వారా అమలుపరచాలి

● చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం

చేర్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 42శాతం బీసీ రిజర్వేషన్లను ఆర్డి నెన్స్ ద్వారా కాకుండా చట్టం ద్వారా అమలుపరచాలని చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను మోసం చేయాలని కాంగ్రెస్ సర్కార్ కుట్రలు చేస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల జిమ్మిక్కుకోసం 42శాతం రిజర్వేషన్ల పేరిట బూటకపునాటకాలు ఆడుతుందన్నారు. ఆర్డినెన్స్ ద్వారా సాధ్యపడదని తెలిసినా మభ్యపెట్టాలని చూడటం సబబుకాదన్నారు. బీసీలను వంచించడం మాని చట్టంద్వారా రిజర్వేషన్లు అమలుచేసేంత వరకు ఊరుకోబోమన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్

మిరుదొడ్డి, జూలై22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్ సూచించారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కేంద్ర బృందం పర్యటన

అక్కన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని జనగామలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ పై కేంద్ర బృందం పర్యటించింది. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సానిటేషన్ వంటివి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏ మేరకు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారనే వివరాలు అడిగి యాప్‌లో అప్‌లోడ్ చేసుకున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, మరుగుదొడ్ల వినియోగం గురించి ఆరా తీశారు. కేంద్ర బృందంతో పాటు ఎంపీడీవో బానోతు జయరాం, ఎంపీవో గుగులోతు మోహన్, పంచాయతీ కార్యదర్శి జమున తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎల్ శిక్షణ తరగతులు ప్రారంభం



ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

సిద్దిపేట కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విషయ నిపుణులతో శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రారంభ సమావేశంలో పాల్గొన్న జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, మండల విద్యాధికారి రాజప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. రిసోర్స్ పర్సన్స్ అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. ఏటిఎల్ ల్యాబ్స్ పనితీరులో సిద్దిపేట జిల్లాను నెంబర్ వన్‌లో నిలపాలని సూచించారు. ఉపాధ్యాయులకు అర్థమయ్యేలా రిసోర్స్ పర్సన్స్ చొరవ తీసుకుని శిక్షణ అందించాలని చెప్పారు.

నీటి వాటా దోపిడీ

● బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురామ్

హుస్నాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాల తెలంగాణ నీటి వాటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దోపిడి చేయాలని చూస్తుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ ఆరోపించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని సంఘమిత్ర బీఈడీ కళాశాలలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో జరిగే నష్టాలపై బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రానికి నష్టం చేసే బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం భరతం పడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు గందె చిరంజీవి, బొజ్జ హరీశ్, పల్లె నవీన్‌కుమార్, మేకల వికాస్, రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

దాశరథి జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

సిద్దిపేట కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మనుషుల క్షోభనుంచే కవిత్వానికి వస్తువు దొరుకుతుందని, సమాజంలోని అసమానతలు తొలిగించే ప్రయత్నంలోనే ఆ కవిత్వం పనిచేస్తుందని ప్రముఖకవి డా. నందిని సిధారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగువిభాగం నిర్వహించిన దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సాహిత్యసమాలోచన కార్యక్రమానికి వక్తగా హాజరై దాశరథి జీవితం, సాహిత్యం, ప్రేరణలు అనే అంశంపై డాక్టర్ నందిని సిధారెడ్డి ప్రసంగించారు. దాశరథి సాహితీ ప్రస్థానాన్ని చారిత్రక, ఉద్యమ, అస్తిత్వ, సాహిత్య నేపథ్యాలలో విశ్లేషిస్తూ దాశరథి కృష్ణమాచార్య తొలిగా స్వగృహంలోనే సంస్కృత భాషాధిపత్యాన్ని ఎదిరించింది మొదలు తన పదిహేనేండ్ల వయసులో నిజాం నవాబు పరిపాలన మీద రాసిన సాహిత్యం గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత మాట్లాడుతూ దాశరథి పద్యాలు తెలంగాణ ప్రజలకు కంచు కాగడాలై కొత్త వెలుతురులను ఎప్పటికప్పుడు అందిస్తుంటాయని పేర్కొన్నారు.

క్రైస్తవ హక్కుల రక్షణ సమితి వార్షికోత్సవం

హుస్నాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24వ తేదీన హన్మకొండలోని సెంటనరీ బాప్టిస్టు చర్చ్‌లో జరిగే క్రైస్తవ హక్కుల రక్షణ సమితి మొదటి వార్షికోత్సవాన్ని యావత్ క్రైస్తవ సమాజం విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎదునూరి మోజేస్ కోరారు. ఇందులో క్రైస్తవ హక్కుల రక్షణ సమితి నాయకులు సోమపంగు విజయ్‌కుమార్, బండ ఇస్సాకు, అజయ్, సుధాకర్ తదితరులున్నారు.